# సుఖంపంటల సంసారం

(కథానిక)

సాయంత్రం ఆరు గంటలవుతుంది. ఉదయం పది గంటలనుండి ఆఫీసులో కొట్టుకొని, మధ్యాహ్నం కాఫీ నీళ్లయినా పుచ్చుకోక పోవటంతో నీరసంగావుండి ఎంత వేగిరం యింటికి చేరుకుందామా అనుకుంటున్నాడు రామ్మూర్తి. రోడ్డు మధ్యగా నడిస్తే ఎక్కడ బళ్ళకింద పడతాడో అని పక్కగా నడుస్తున్నాడు. తోటిగుమస్తాలు చాలామంది బస్సుల మీద పోయేరు. కొంతమంది సైకిళ్ళమీద ప్రయాణం సాగించేరు. తనూ ప్రయత్నించేడు, ఎలాగైనా ఒక సైకిలు కొనుక్కుందామని. ఏమైనా నీలవుతేనా. ఇంక్రిమెంట్లు అన్నీ కలుపుకుని వస్తున్న ఎనభైరెండు రూపాయలు రెండు పూట్లా కడుపునిండా తిండి తినటానికైనా సరిపోకుండా వుంది. పిల్లా పిచికా అనుకుంటే అదీ లేదు. లింగులింగుమంటూ తనూ, భార్య సుందరమ్మ. ఈ రెండు పొట్టలు నిండటానికే కష్టంగావుంది. మరి సైకిలు కొనేది ఎలాగ?

ఇల్లు దగ్గర పడుతూంది. మెయిను రోడ్డు మీంచి పక్క సందులో పడ్డాడు. తనకన్న ముందుగానే సైకిలుపై ఇంటికిపోయి శేషయ్య తిరిగి బజారువేపు పోతున్నాడు.

"ఇప్పుడేనేమిటి వస్తున్నావు ఆఫీసునుండి? నువ్వు చాల మెల్లిగా నడుస్తావే" శేషయ్య పలకరించాడు.

"తొందరగా నడిచి యింటికెళ్ళి చేసే ఘన కార్యం ఏముందని?"

శేషయ్య ఇటువంటి సమాధానం వస్తుందని అనుకోలేదు. అతనికి తరువాత ఏం మాట్లాడాలో తెలిసేది కాదు.

"ఎక్కడికి బయల్దేరావు" రామూర్తే మాట్లాడేడు.

"అలా బజారువేపు పోతున్నా. యిదుగో నీదగ్గర రెండు రూపాయలుంటే అప్పివ్వూ, రెండు మూడు రోజుల్లో యిచ్చేస్తా" అన్నాడు.

"ఇప్పుడు డబ్బుంటుందనే అడిగేవా శేషయ్యా? యింతకీ అంత అవసరమేమి వొచ్చిందని?"

కారణం చెప్పటానికి ఇష్టంలేదు శేషయ్యకు కాని,

"కొంచెం పనుండిలే. అయితే వస్తాను" అంటూ పోయేడు.

ఈ రోజుల్లో చాలామందిదగ్గర నెలాఖరు రోజుల్లో చిల్లిగవ్వ వుండదు. రామ్మూర్తి కూడా యీ తెగకు చెందినవాడే. అందుచేత కొంచెం డబ్బున్నవారిదగ్గర అప్పుడప్పుడు చేబదులు చేస్తుంటాడు. స్వతస్సిద్ధంగా "చేసిన అప్పులు తీర్చకూడదు" అనే జాతికి చెందిన వాడు కాదు రామ్మూర్తి. కాని ఎప్పటిఅప్పులు అప్పుడు తీర్చలేకపోతున్నాడు. కొంతకాలం పాటు రామ్మూర్తి స్నేహితులు, ఎవరి మనస్సుల్లో వాళ్ళు తర్జనభర్జనలు జరుపుకుని ఒక నిర్ణయానికి వచ్చేరు. "వెనిది అమల్లో పెడదామనుకుంటున్నా"నని ఒకరొకరితో చెప్పుకో లేదు కాని పనులు మాత్రం కూడబలుక్కున్నట్లు జరిగిపోతున్నాయి. ఆచరణ విధానం ఏదైనా సరే ఫలితం ఒకటే. రామ్మూర్తికి పూర్వంలాగ అప్పు పుట్టటం లేదు. వీధిలో అప్పు పుట్టదు. ఇంట్లో కుండ లేవదు.

* * *

రామ్మూర్తి యిల్లు చేరుకున్నాడు. తలుపు వేసుంది. "ఇదుగో, తలుపు" అంటూ తట్టేడు.

"అంతలా తలుపులు బద్దలు కొట్టకపోతే కొంచెం నెమ్మదిగా పిలవకూడదూ, తలనొప్పి వొస్తూంటేను!" అంది భార్య సుందరమ్మ.

ఆమెకు తలనొప్పిగా వుందని అతనికేం తెలుసు? "తల నొప్పిగా వుందని కబురంప

జి. అమృతరామయ్య

లేకపోయావా" అందామనుకున్నాడు రామ్మూర్తి. కాని ఆ పిచ్చిదానితో ఎందుకు అని మనస్సు బోధపర్చింది.

ఆమె అతని దగ్గరనుండి సానుభూతి వచనాలు వస్తాయనుకుంది. "ఏం? ఎందుచేతై యుంటుంది?" అని అంటాడనుకుంది. తన మనసులో అక్కసు అంతా వెళ్ళబోసుకుందామనుకుంది. ఆఖరికి "ఇంక కాఫీ లేకపోతే నేను బతకను" అని చెప్పి "నేను ఏవిధంగానైనా చచ్చిపోతే చక్కగా మళ్ళీ పెళ్ళి చేసుకుందా మనుకుంటున్నట్టుంది" అని దెప్పి పొడుద్దామనుకుంది.

ఎన్నను కున్నా, ఎంత ఘాటుగా రామ్మూర్తిని తిట్టుదామనుకున్నా, అసలు అతను మాట్లాడితేనా!

తన పనులన్నీ శాంతంగానే చేసుకు పోతున్నాడు రామ్మూర్తి. కాళ్లు కడుక్కొందుకు పెరట్లోకి పోయేడు. సుందరమ్మ యింక ఆగలేకపోయింది. లేచి వెళ్లి జేబు సవరించింది. ఆమెకు కావల్సినవి అందులో లేవు. నిరాశతో మళ్లీ చాపమీద నడుంవాల్చింది.

"నిప్పు చెయ్యమన్నావా?"

ఆమె యీ సమయం కోసమే ఎదురు చూస్తోంది. కడుపులోవున్న బాధ నంతటినీ ఒక్క వాక్యంలో రామ్మూర్తిపై విసిరి పారేద్దా మనుకుని,

"కాఫీపొడి లేకుండా నిప్పెందుకు, తగలెట్టుకుందుకా?" ఈ దెబ్బతో అతను తన కాళ్ళపై పడ్డంత పనిచేసి వెంటనే బట్టలు వేసుకుని బజారుకు పయనమవుతా డనుకుంది.

"కాఫీ మానా నన్నావుగా"

"నేను చస్తే కాని యీ కాఫీ బాధ వదలదు. కాఫీ లేకపోతే నాకు వీల్లేదు"

"ఇంతకన్న పెద్దగా వుండే నా సిగరెట్ల అలవాటే తప్పిపోయింది, కాఫీ అనగా ఎంత?"

సుందరమ్మ శరీరంపై తేళ్లు పాకుతున్నట్టయింది. "ఇంత పవిత్రమైన నా కాఫీ అలవాటును యెంత చులకనచేశారు" అనుకుంది. తెలియని ఆవేశంతో "కట్టుకున్న పెళ్ళాం ముండకు యిన్ని కాఫీనీళ్లు పొయ్యాలేని బ్రతుకు ఏం బ్రతుకు?" అంది.

ఆ సమయంలో రామ్మూర్తి తప్ప యింకెవరున్నా నిజంగా ఎంతోపెద్ద రభస జరిగేదే. ఇలాగైనా అతని మనస్సు నొప్పిస్తే తనవాంఛ యీడేరుతుందనుకుంది సుందరమ్మ. కాని కథ అడ్డం తిరిగింది.

"డబ్బుంటే యిప్పుడు బజారుకుపోయి తెచ్చేవాడినే, నా సంగతి నీకు తెల్సుగా"

"మీదగ్గర డబ్బుండే దెప్పుడు? రోజూ యెందుకులే అని మాట్లాట్టంలేదు కాని నేనెంత బాధపడుతున్నానో మీకేం తెల్సు"

"నాకు తెలియదనటం లేదు. కాని నేను చెప్పినట్టు నీవు యీ చిన్న విషయంలో యిది వరకే చేసియుంటే యిప్పుడింత కష్టపడవలసిన అవసరం ఉండేది కాదు"

"నేను ఏం చెయ్యటంలేదు మీరు చెప్పినట్టు?"

"కనిపిస్తూనేవుంది యీ ఒక్కసారి తెస్తే దీంతో యింక మానేస్తానని చెప్పేవు. నీ మాటే నువ్వు నిలబెట్టుకో లేకపోయావు"

"నేను చెయ్యలేని పని అది."

"కాని కొన్ని కొన్ని పనులు మనం చెయ్యలేనివైనా ప్రాణహాని లేనంతకాలం కొంత శ్రమకోర్చి ఆ పని చెయ్యాలి."

"ఊఁ! చెప్పేవి శ్రీరంగనీతులు..."

"అలా నువ్వన్నంత మాత్రాన అయిపోయిందీ. యీ పని నిన్ను వద్దని, అదేపని నీకు తెలియకుండా నేను చేస్తేగా, ఆ మాటకు విలువ."

"అవును, నాకు విలువ వుంటేగా, ఛీ! ఎందుకీ బ్రతుకు" చిన్న పిల్లలా ఏడుస్తూ వంట యింట్లోకి చాప పట్టుకు పోయి తలుపు ఘెళ్లున వేసింది. రామ్మూర్తి చికాకుగా, "పరిస్థితులు గ్రహించమన్నాను కాని, చీటికి మాటికి ఏడవమని కాదు నే చెప్పింది." అంటూ లాల్చీ వేసుకుని వీథిలోకి పోయాడు.

* * *

ఇటువంటి సంఘటనలు రోజూ దాదాపు జరుగుతూనే యున్నాయి. రామ్మూర్తి ఎంత శాంతంగా ఉందామన్నా వీలుపడకుండా ఉంది. పరిస్థితులు మరీ విషమరూపం దాలుస్తున్నా, "కష్టే ఫలే" అన్న వాక్యం స్మరణకు

తెచ్చుకునేవాడు. అతను ఎంత నెమ్మదిగా వుంటున్నాడో ఆమె అంత రెచ్చిపోతూంది. అతనికి ఏం చెయ్యటానికీ తోచటంలేదు. పరిస్థితులు యీ విధంగా వుంటే కొద్దికాలంలోనే తను పిచ్చివాడవటం ఖాయం. ఎలాగైనా ఆమెలో మార్పుతేవాలి అనుకున్నాడు. తొలి ప్రయత్నంగా తరువాత నెలజీతం అంతా ఆమె చేతిలో పెట్టి ఖర్చు చెయ్యమంటే బాగుంటుందనుకున్నాడు.

జీతాలు రాగానే సాయంత్రం యింటికి వచ్చి ఆమె చేతికి డబ్బు యిచ్చేడు.

"ఎందుకు?" అంది సుందరమ్మ ఆశ్చర్యంగా.

"నీకేదో అనుమానంగా వుందిగా, నిన్ను కాదని నేను అనవసర ఖర్చులు పెడుతున్నానని, అయినా ఎంతకని? అవతల ఆఫీసు పనితోనే బుర్రపాడై పోతూంటే, యింటిపన్లు కూడా ఏం చెయ్యగలను? అందుచేత యీ నెల నుండి డబ్బు నేనొక కానీ కూడ ఉంచుకోకుండా అంతా నీచేతిలో పెట్టి కొంతవరకు విశ్రాంతి తీసుకుందామనుకుంటున్నా."

"ఊఁ" అంటూ డబ్బు పుచ్చుకుంది. పెట్టి తాళంతీసి లోపల రూపాయలు పెడ్తూ "పోనీ బజారుకేనా పోయి......" మాట పూర్తి చెయ్యనే లేదు ఆమె.

"బజారు లేదు, ఏంలేదు. ఆఫీసు నుండి వచ్చిన వెంటనే యిలా కుర్చీలో కూర్చుంటా. యింతకన్న మరేం చెయ్యలేను. బజారులో తిరగటానికి నీకేం అభ్యంతరం లేదు, అనుజ్ఞ యిచ్చేను."

"బాగా నేర్చున్నాయి మాటలు" రామ్మూర్తి సమాధానం చెప్పలేదు. ఆమె యింట్లోకి పోయింది.

*　　　*　　　*

మర్నాడు సుందరమ్మ బజారుకు పోయింది. ముందుగా తనకు కావల్సిన కాఫీపొడి, గాజులు రెండు డజన్లు, రెండు గజాల రిబ్బను గుడ్డలు, మైసూరు శాండల్ సబ్బు రెండు ముక్కలు యిత్యాదికొని మిగిలిన డబ్బుతో పప్పులు, అవీ ఇవీ కొని యింటికివచ్చింది. అప్పటికి రామ్మూర్తి ఆఫీసునుండి వచ్చి అరుగుమీద కూర్చున్నాడు. జవాబుగా తలుపు తీసింది. ఇద్దరూ లోన ప్రవేశించారు. వెనకనున్న కూలివాడు నెత్తిమీద బుట్ట గదిమధ్యలో వెలిపాడు. రామ్మూర్తి అంకులో సరుకులు చూచేడు. "డబ్బు విలువ తెలియని మనిషి" అనుకున్నాడు.

మెల్లగా వారంగడిచింది. రెండు, మూడు కూడా.

"ఏమండీ" సుందరమ్మ పిల్చింది.

"ఏం?" అన్నాడు రామ్మూర్తి.

"రేపు రేషను చీటికి డబ్బులేదు" అంది.

"నన్నేం చెయ్యమంటావ్" అన్నాడు.

"ఎక్కడేనా అప్పు."

"ఎవరిస్తారు?"

"ఏమో?"

"అంత తెలియనిదానివి..." యింకా ఏమో అనబోయాడు.

"నేనేం రూపాయలు మింగేశానా, కావల్సిన వస్తువులు కొన్నాను, డబ్బయిపోయింది."

"నువ్వు కొన్నవన్నీ కావలసిన వస్తువులేనా?" ఇన్నాళ్ళకు రామ్మూర్తి నోటివెంట కటువుగా మాటలు వచ్చేయి.

"కాకేం?"

"ఇప్పుడా రెండు డజన్ల గాజు లెందుకు? చేతికి లేకపోతే కొన్నా బాగుంది..."

"నాకు అదంతా అనవసరం, నా యిష్టమొచ్చినట్టు ఖర్చు పెట్టమన్నారు, పెట్టేను."

"ఇష్టం వచ్చినట్టు అంటే యిది కాదు అర్థం. ఉన్న డబ్బులో రోజుకు అధమం ఒకపూటేనా తిండి కుదిరేట్టు ఖర్చెట్టమని."

"........"

"దేశ పరిస్థితులు, మన ఆస్తి. ఆదాయం చూసుకుని వ్యవహరించాలిగాని, పిచ్చిగా ఈ క్షణంలో డబ్బుందికదా అని కోరిగాని ఖర్చులు పిచ్చి వాళ్ళలాగ, తాగిన వాళ్ళలాగ..."

"అవును. నేను పిచ్చి ముండనే, తాగిన ముండనే. మరి అటువంటప్పుడు పిచ్చిదానితో కాపురమెందుకు, ఛీ! పాడు బతుకు."

"నీకంత యీ కాపురం యిష్టం లేకపోతే నేను బలవంత పెట్టను. కాని నేను ఎంతగా శ్రమపడ్డానో నీబుద్ధి మార్చి, నిన్ను మామూలు మానవ సమాజంలో గౌరవంగా బతికేట్టుచేసి,

బ్రతుకు బాటను ఎంతగా సరిచేద్దామనుకున్నా అంతగా అవి దూరమవుతూ వచ్చినయి. ఈ విషయంలో నాలో ఏమీ లోపం లేదని చెప్పగలను. అయినా ఎందుకీ పోది. మన యిద్దరి భావాలు యింక కలియవు. రోజూ మనం యిలా యీ చిల్లర విషయాలమీద కొట్లకుక్కల్లా దెబ్బలాడుకోవలసిందే. ఈ దేశంలో మన సంసారమే గాదు, చాలా సంసారాలు బాధపడుతున్నవి యిలాగే. నువ్వన్నట్టు చాలా మంది అంటారు సంసారాలు చెయ్యలేమని. కాని విడిచివెళ్ళరు. వెళ్ళలేరు. నామట్టుకు నాకే ఎందుకో భయంగా వుంటుంది, ఆ సంగతి తల్చుకుంటే."

"ఏమిటో పిచ్చివాగుడు నాది..."

"దానికేం డబ్బుమాత్రం అప్పూపుట్టదు" రామ్మూర్తి చొక్కా బుజంమీద వేసుకుని యింట్లోనుండి బయటపడ్డాడు తాత్కాలిక శాంతికోసం.

---

ఒక మధుర స్మృతి

# కల కాలేని నిజం

"స్వప్నం"

నేనా ఊరికి కొత్తగా వచ్చాను. అక్కడ నాకు తెలిసినవాళ్ళెవరూ లేరు. నా జేబులో ఉండిన కొస్త డబ్బూ తిండి కింద అయిపోయింది. నా ఒంటిమీది దుస్తులు పాతవి, చినిగినవి. అమ్ముకుందుకు పనికిరావు.

ఆకలి. పగలల్లా తిరిగినా ఏకూలీ దొరకలేదు. సాయంత్రం అవుతోంది. ఆకాశం మేఘావృతం. గడ్డు చలికాలం. ఊరి చివరి సంత మార్కెట్టు చేరేను. అంతా నిర్మానుష్యం. వారానికోసారే బజారుంటుంది. కొన్ని పెట్టె కొట్లు తాళం వేసుకు పోయారు ఆసాములు. సంతనాడే మళ్ళా తెరుస్తారవి. వెనక రోజే సంత అవడంవల్ల తుక్కు కుప్పలలో దుకాణాల కింద వెతుకుతున్నాను. పొట్టకు ఏదైనా దొరకదా అని.

నేటి నాగరికతా ప్రపంచంలో కడుపుకు తిండి దొరకడం అతి కష్టం. కాని ఆత్మకు కావలసినంత ' ఎక్కడ పడితే అక్కడ రేడియోల ద్వారా, ఉపన్యాస వేదికల ద్వారా, గ్రంథాల ద్వారా, బలవంతంగా కూడా ఆత్మలను నింపడానికి ఎంతోమంది పూనుకుంటారు. మాడుతున్న పొట్టకి ఓ కడి అన్నం వేసేవాడు కనిపించడు. చక్కని బజార్లూ, తీరుగా కట్టిన భవనాలూ, శిలా విగ్రహాలూ, శిల్ప సౌందర్యాన్ని ఆత్మకు తినిపిస్తాయి. నృత్యము సంగీతము అమృత సమమగు కళాసవమును అందిస్తాయి. వెలలేని అందమైన దుస్తులు ధరించిన రసికులు, దూరంగా దరిద్రుని కళ్లకు ఆనందం కూరుస్తూ తిరగాడుతారు. ఇంత సుళువుగా ఆత్మకు ఆహారము దొరుకుతూ ఉంటే కాలెడి పొట్టకు ఓ మెతుకు కూడ హుళక్కి. ఈ విపరీతము మానవులకో గుణపాఠం నేర్పదూ?

చీకటి పడుతోంది. గాలి తుఫానుగా మారుతోంది. చినుకులు పడుతున్నాయి. పెద్ద పట్టణపు పరిసరమైనా, ఆ స్థలం సహారా ఎడారి. దూరంగా వినబడే శబ్దాలు మాత్రమే పట్టణమున్నట్టు తెలియడానికి ఆధారము. తల దాచుకొందు కాస్కారము కనపడడము లేదు, ఓ పాడు గుడిశె తప్ప. చలివేంద్రమేమో - వేసవి వరకూ దానిజోలి కెవరూ పోరు.

ఆకలి దహించుకు పోతోంది. నా అవస్థ చూచి, భరించలేనన్నట్టు ఆకాశం కన్నీటి ధారలను వదలటం ప్రారంభించింది. నన్నోదార్చడానికి కాబోలు, వాయుదేవుడు నా అవయవాలను గాఢంగా కౌగిలించుకుంటున్నాడు. నా మీద కనికరంచే కాబోలు చీకటి నాకు వసనంగా మారిపోయింది.

నాకప్పుడు పద్ధెనిమిదిసంవత్సరాలు. చనిపోవడానికి చక్కని ప్రాయము. అంతలో దగ్గరలో ఓ శబ్దం వినిపించింది. ఏదో మూలుగు; విసుగు; లాగుతున్నట్టేదో... ప్రాణం లేచివచ్చింది. ఆ ఎడారిలో నాలాటి దీనుడెవడో... ఆ వైపు